అసలు సంగతి

"ఛాయ"

అదేమిటా తెల్లారి నిద్ర లేచేటప్పటికి పడకగదిలో ఉన్న ప్రతీ వస్తువూ తనను తీక్షణంగా చూడడం గమనించి, కలవర పడింది ఇందిర. ఎప్పుడూ ప్రేమతో చూసే అమ్మ కూడా ఆ గిల్టు ఫ్రేములోంచి చిరాగ్గా చూస్తోంది "యేమిటే, ఇప్పుడా లేవడం ?" అన్నట్టు. పుస్తకాల షెల్ఫు, టేబిల్ లైటు 'జాగ్రత్త' అని హెచ్చరిస్తున్నాయి. 'ఇవాళ తనకేమయింది ?' అని గదంతా కలయ చూసింది. అప్పుడే బల్లక్రింద నుంచి తొంగి చూస్తున్న యెలుక పిల్ల ఒక్క విషపు చూపుచూసి త్వరత్వరగా వెళ్ళిపోయింది. సాధారణంగా యెలుక పిల్లలు చూపుల్లో ప్రేమాభిమానాలు కనబడతాయి. అలాంటిది ఇంత చిన్న యెలుకమ్మ, తన నెందుకలా చూసింది చెప్మా, అని మంచంమీదే కూర్చుని ఆలోచిస్తోంది ఇందిర.

ఇంతలో తలుపుతెరుచుకుని, ఇందిర తల్లి వచ్చింది గదిలోపలికి. మంచం మీద తీరిగ్గా కూర్చున ముద్దుల కూతుర్ని చూసి "అదేమిటే అమ్మాయ్, తెల్లగా తెల్లవారింది కదా, మళ్ళీ కాలేజీకి ఉరుకులూ పరుగులూనూ-లేవకూడదూ- ఏమిటా ఆలోచన కొంపలు మునిగినట్లు ?" అంది మెల్లిగా మందలిస్తూ. అమ్మ కళ్ళల్లో ఆప్యాయత. తను మనసారా చూసి, అమ్మకీ, అమ్మఫోటోకి యెంత తేడా ఉంది అని ఆశ్చర్యపోతూ మంచంమీదనుంచి దిగింది ఇందిర.

గబగబా తయారయి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని కాలేజీకి బయలుదేరింది ఇందిర. చదువుకునే రోజుల్లోనే నయం. చిరాగ్గా ఉంటే క్లాసులు యెగ్గొట్టేది. ఇప్పుడలా వీల్లేదు. ఇష్టం ఉన్నా లేకపోయినా వెళ్ళి తీరాల్సిందే. 'వెధవ ఉద్యోగం' అనుకుంది చిరాగ్గా. పోనీ ఉద్యోగం మానేద్దామా అనుకుంటే, మానేసేం చెయ్యాలి అని ఇంకో సవాలు. సుఖంగా ఇంట్లో పడుండనివ్వదు యిది. అసలిప్పటికే 'పెళ్ళో పెళ్ళో' అని ఒకటే పోరుతోంది అమ్మ. నాన్నగారు మొన్నయితే నవ్వుతూ అననే అన్నారుకూడా "ఎవరో" ఒక శాల్తీని. నువ్వాన్నా చూసుకో, నన్నన్నా చూడనీ అని. అదేమిటో పెళ్ళికాని, పెళ్ళి చేసుకోదల్చుకోని ఆడపిల్ల అంత వింతగా, అసహజంగా కనిపిస్తుంది. అయినా తనేంచేసుకోగూడదని ఏం వ్రతంపట్టలే

దుగా. ఏటొచ్చీ తనకు అన్ని విధాలా నచ్చిన మనిషి కనబడలే దింతవరకూ. అసలు సుమిత్ర తన వర్ణన విని, 'అటువంటి మనుషులు చాలా అరుదు. ఒకవేళ అలాంటివా డొకడున్నా, అతనికి నువ్వు నచ్చకపోవచ్చు. కాబట్టి నువ్వు నీ నిర్ణయం మార్చుకోకపోతే 99 శాతం బ్రహ్మచారిణివిగా ఉండిపోతావు జాగ్రత్త' అని బెదిరించింది.

పెళ్ళిని గురించి ఆలోచన వచ్చిన ప్పుడల్లా, ఈమధ్య మనసులో శ్రీనివాసుడే మెదులుతున్నాడు. అతన్ని మొదట కమల ఇంట్లో కలిసింది. ఆకర్షణీయంగా ఉన్న అతని మాటకారితనం ఆమెను ముచ్చట పరిచింది. రెండోసారి అతన్ని చూసింది ప్రమీల ఇంటిలో. ప్రమీలకు దూరపు చుట్టమూ, వరసకు బావ అవుతాడట. ప్రమీల చక్కనిదీ. ఆ పైన

తియ్యగా పాడుతుంది కూడా. వాళ్ళిద్దరి వరసా చూసి, అతనిపైన ఆశలు పెట్టుకోకూడదని గుండె రాయి చేసుకున్న తర్వాత ప్రమీల చెప్పిందొక శుభవార్త. "భలే దానివే ఇందూ, మా బావను ఒక్క ఊపు ఊపావు. నీ గురించి అడిగి యమ బోరె తీస్తున్నాడు నన్ను" అంది తమాషాగా నవ్వుతూ. 'నిజం అయితే బాగుండు' ననుకున్న ఇందిర గుండెలు టకటకమని పెద్ద చప్పుడు చేస్తూ గబగబా కొట్టుకున్నాయి. ఆ తర్వాత అతన్ని అరడజనుసార్లన్నా చూసింది. ప్రతిసారీ, అతనికి తనంటే ప్రత్యేకాభిమానం ఏం లేదేమోననీ, ప్రమీల మాటలు కేవలం నవ్వులాట కన్న వేమోననీ ఇందిర సందేహిస్తూనే ఉంది. కానీ, అతన్ని చూసిన ప్రతిసారీ అతనంటే ఆకర్షణ, వంటరి జీవితమంటే జుగుప్స అధికమవుతున్నాయి. అతన్ని ఎలాగయినా సరే తన వైపుకి తిప్పుకోవాలని నెలరోజులుగా ప్రయత్నిస్తోందామె. కానీ, అత నంటీ ముట్టనట్టున్నాడు. 'మరీ తామరాకుమీది నీటిబొట్టులా ఏమిటా ప్రవర్తన' అని ఎంతో విసుక్కుంది ఇందిర. తనంటే ఎంతో ఇష్టం ఉన్నట్టు కనబడతాడు. మళ్ళీ అది కేవలం స్నేహభావం తప్ప ఇంకేంకాదేమో నన్నట్టు ప్రవర్తిస్తాడు. అమీతుమీ తేల్చుకోవా లనిపించినా, ఎలా తేల్చుకోవాలో తెలియక ఊరుకుంది.

సరే, ఎలాగో అవస్థపడి బస్సులో పది నిమిషాల ప్రయాణం తర్వాత కాలేజీ చేరింది ఇందిర. క్లాసులో పాఠం చెబుతుంటే వెనక బెంచీలో కూర్చుని కిసుక్కున నవ్విన రేవతిని గట్టిగా కోప్పడి క్లాసులోంచి బైటికివెళ్ళి పొమ్మంది. ఆ పిల్ల, అందుకోసమే యెదురు చూస్తున్నట్టు చిరునవ్వుతో క్లాసులోంచి వెళ్ళడం చూశాక నీరసమనిపించిందామెకు. గబగబా నాలుగు ముక్కలు చెప్పి పది నిమిషాలు ముందుగా క్లాసు వదిలిపెట్టింది. "అసలీ రోజు మంచిది కాదు" అని తనకు తాను నచ్చ జెప్పుకుని కాలేజీ నుంచి బైటపడింది. బస్సు కోసం చూస్తున్న ఇందిరను హడావిడిగా పలకరించింది కమల. కమల హిస్టరీ చెబుతుంది అదే కాలేజీలో. ఇంకో కమ్మాయితో కలిసి ఆమె కాలేజీకి దగ్గర్లో ఒక యింట్లో ఉంటోంది. తమ గదికి వచ్చి ఆ పూట గడపమని ఆహ్వానించగానే, సరేనని బయల్దేరింది ఇందిర. ఇంటికివెళ్ళి తన గదిలో తన వంక కోపంగా చూసేబల్లనీ, పుస్తకాల షెల్ఫ్‌నీ యెదుర్కొనే ధైర్యం లేక.

కమల స్నేహితురాలు మంజుల ఏదో న్యూస్ పేపరు ఆఫీసులో పని చేస్తోంది. ఆ పిల్ల అతి ఆధునికంగా ఉంటుంది. అంటే కేవలం అలంకరణలోనే కాదు, అలవాట్లలో కూడా. సిగరెట్లు కాల్చే ఆ సుందరి తెలివితేటలు అసాధారణమైనవి. రాజకీయాలూ, సాహిత్యమూ ఆ పిల్ల అభిమాన విషయాలు. మొత్తం మీద ఆమెతో గడిపే గంటలు ఎంత లేదన్నా అరగంటల్లా గడిచిపోతాయి.

ఆ అమ్మాయి స్నేహబృందం కూడా అటువంటిదే. అతి వాస్తవిక సాహిత్యమూ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలూ కూలంకషంగా చర్చించారు కమలా, మంజులా ఇందిరతో. గడియారం అనుకున్నదానికంటే తొందరగా తిరగడంతో, ఇల్లు చేరే వేళయిందని గమనించి నీరసంగా లేచింది ఇందిర. మంజుల ఒప్పుకోలేదు. "ఆరవ్వగానే ఇల్లు చేరుకోవాలని యేమన్నా రూలుందా? చిన్నపిల్లవి కావుగా చీకటిని చూసి ఝడుసుకోవటానికి. ఇంకాసేపుండి వెడుదువుగానీ కూర్చుండూ" అని గదమాయించింది. కమల వంత పాడుతూ అందుకుంది, "కాదు మంజూ, ఈ అందగత్తెని ఏ రాకుమారుడు ఎత్తుకుపోతాడోనని వాళ్ళమ్మగారి భయం." "మరే, నా అందానికి ఒక్క రాకుమారుడే తక్కువ" అంది ఇందిర ముఖం చిట్లించి కూర్చుంటూ. "ఎంత ప్రేమ ఉన్నా, నన్ను కని పెంచిన మా అమ్మ కూడా నేనందగత్తెనని అనలేదు."

"హలో, మర్యాదగా తలుపు కొడితే వినిపించుకోలేదు. మరేం చెయ్యమంటారు?" అన్నాడు శ్రీనివాసరావు ఎదురుగా నుంచుని.

"ఇన్నాళ్ళకా కనబడడం పెద్దమనిషీ?" అంది మంజుల. "రా కూర్చో" అని కుర్చీ చూపించి ఇందిరని పరిచయం చేయబోయింది. "వీరు నాకిదివరకే తెలుసు మంజులా. మా ప్రమీల స్నేహితురాలు" అన్నాడతను అందంగా నవ్వుతూ. అతని నవ్వు అరగాలను పెట్రోలయ్యి మండుతున్న ఇందిర గుండెల్ని భగ్గుమనిపించింది. "ఏమిటితని అభిప్రాయం? తన స్నేహితురాలనని చెప్పుకోడానికి నామోషీయా? ప్రమీల స్నేహితురాలినిట. ఛీ" కమలతోనూ, మరీ ముఖ్యంగా మంజులతోనూ అతను మాట్లాడే ధోరణి చూసి, ఇంకా మండిపడింది ఇందిర లోపల్లోపల. ఎంతో కులాసాగా, చమత్కరిస్తూ మాట్లాడుతున్న ఆ తీరున తనతో యెన్నడూ మాట్లాడలేదతననుకుంది. అతనికి తను స్నేహితురాలు కాదు. తన వంక కూడా అతి తక్కువగా చూస్తూ, ఎప్పుడో తప్ప తనతో సూటిగా మాట్లాడని అతని ప్రవర్తన ఇందిరకు దుర్భరమనిపించింది. అయినా తనని తను సముదాయించుకోడానికి 'అతనెలా ఉంటే తనకేం - తనూ పట్టనట్టూరుకుంటేసరి' అనుకుంది. అంతేకాక, వెంటనే లేచి వెళ్ళిపోరాదూ అని కూడా ఆలోచించింది. ఇంతలో మంజుల "నువ్వూ ట్రై చేస్తావా?" అనడగడంతో ఏమిటా అని తలెత్తి చూసింది. మంజుల చాపిన చేతిలో, ఆమె పొడవైన వేళ్ళ మధ్య తెరిచిఉన్న తెల్లని సిగరెట్టు పెట్టె కన్పించింది. "తీసుకో ఒకటి. అభ్యంతరం లేకపోతే" అంది మంజుల. క్షణంసేపు సందేహించిన ఇందిర, తనూ మంజులలాంటిదేనని అతనికి తెలియపరచాలన్నట్లు ఒక సిగరెట్టు తీసుకుంది. అతను జేబులోంచి లైటరు తీసి మంజుల సిగరెట్టు వెలి

గించి. ఇందిర వంక తి గాను. 'నో, థాంక్స్' అంటూ కమల అందించిన అగ్గిపుల్లతో సిగరెట్టు వెలిగించింది ఇందిర. ముగ్గు రాడవాళ్ళూ. అతడూ సిగరెట్లు కాలుస్తున్న దృశ్యం తమాషాగా ఉంది. ఎవరి ఆలోచనల్లో వాళ్లు వున్నారు. ఇందిర మాత్రం పొగ మింగెయ్యకుండా, సిగరెట్టు కాల్చడంమీద తన దృష్టిని లగ్నం చేసింది. పొగగానీ మింగితే ఎంత బాధో తెలుసును ఇందిరకు. తలంతా తిమ్మిరెక్కినట్టయి పోతుంది కొద్ది నిమిషాలసేపు. ఆ పైన వలకమారి దగ్గు వచ్చినారావచ్చు. సగం సిగరెట్టు కాలాక కొంత తేలికపడింది ఇందిర. శ్రీనివాసరావు అంతవరకూ నిశితంగా ఆమె వంకే చూస్తున్న వాడల్లా చటుక్కున తల తిప్పి మంజులతో మాట్లాడడం మొదలెట్టాడు. మొదట్లో ఎందుకో సిగ్గుపడ్డా తనను తను మందలించుకుని వాళ్ళ మాటల్లో ఆసక్తి కనబరచడానికి ప్రయత్నించింది. ఆమెవంక చూడకుండా, ఆమెకు తెలియని విషయాల గురించి మాట్లాడు తున్నాడతను. ఎదుటి గోడమీది బల్లి నల్లపూసల్లాంటి గుడ్లతో చూస్తూ మందహాసం చేస్తోంది. ఎలుకపిల్లని

విషపు చూపులన్నా భరించవచ్చు కానీ, బల్లుల మందస్మిత వదనాలు చూడ శక్యం కావనే సత్యాన్ని ఆరోజు గుర్తించింది ఇందిర. కమలా, మంజులా అతని మాటలను తాగేస్తున్నారు. ఇదంతా అవమానకరంగా తోచింది ఇందిరకు. తనెలాపుంటే అతనికేం? నిజమే, తనే సిగ్గులేకుండా అతని అనుమతి కోసం చూస్తున్నట్టు ప్రవర్తిస్తున్నది. 'అతనికీ తనకీ ఏ విధమైన సంబంధం ప్రస్తుతం లేదు. ఇకముందు బహుశా ఉండబోదు' అని గట్టిగా అనుకున్నాక ఇందిర మనసెంత తేలికపడిందంటే, పదిహేను వేల మైళ్ళు కాలినడకను ప్రయాణం చేసినంత అలసట, నీరసం వచ్చాయి. బలవంతాన లేస్తూ ఇంక వెళ్ళిపోవాలి. నాకు తెలుసు ఈ రోజు ఇలాంటిదని అనుకుంది. తను లేవడం కూడా ఎవరూ గమనించినట్టు లేదు.

"ఇంక నే పోతాను మంజులా - చాలా థాంక్సు" అంది గట్టిగా. "సరే మళ్ళా ఎప్పుడన్నా రావాలి" అంది మంజుల వెళ్ళిరమ్మన్నట్టు చూస్తూ. "చీకటి పడింది జాగ్రత్త ఇందిరా! బూచాడెక్కడన్నా ఉన్నాడేమో" వెక్కిరించింది కమల. "ప్రపంచంలో ఉన్న వాళ్ళంతా బూచాళ్ళే– భయపడి లాభం లేదు" అంది ఇందిర వేదాంతిలా. "మీ రెక్కడికి కెళ్ళాలి?" అనడిగాడు శ్రీనివాసరావు. జవాబు చెప్పకుండా కాంతి లేని కళ్ళతో అతని వంక చూసి నవ్వులాటి దొకటి నవ్వింది.

"చిక్కడపల్లి" అందించింది కమల. "నాకూ అటువేపు పని ఉంది, పదండి నేనూ వస్తాను" అని మంజుల వంక తిరిగి "ఇంకోసారి మళ్ళీ వస్తా మంజులా, ఈసారి కిప్పుడు వదిలెయ్యి" అంటూ మంజుల చెప్పేది వినిపించుకోకుండా ఇందిర వెనకాలే నడిచాడు.

ఇందిర గ్లాసెడు హార్లిక్సు తాగినట్టు ఫీలయింది. మౌనంగా ఇద్దరూ బస్సుస్టాండు దగ్గర నుంచున్నారు. బస్సు కోసం నుంచున్నవాళ్ళెట్టేమంది లేరు. "ఇవాళ చాలా మంచిరోజనిపిస్తోందినా" కన్నా డతను, నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ. "మంచి రోజా? ఏమో. నేను మాత్రం ఈ రోజంత చెడ్డ రోజు ఇంకెప్పుడూ చూడలేదు" అంది తల అడ్డంగా ఊపుతూ.

"అదేం అలా అంటున్నారు?" వింతగా అడిగా డతను. "అదేమిటో ప్రొద్దున్న లేవగానే, నా గదిలో కుర్చీలూ, బల్లా కూడా కోపంగా చూశాయి. అప్పుడే అనుకున్నాను ఈ రోజు మంచిదికాదని."

"ఇప్పు డది నిజమని రుజువయింది కాబోలు" నన్నాడు. 'అబ్బే, అలాగనడంతే'దని తడబడిందిఆమె. "ఇటు చూడండి, ఇందిరా. మీకు వీలుంటే వకసారి రేపు ప్రమీల ఇంటికి రాగలరా?" ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్టుంది అతని కంఠం.

"నేనా, యెందుకూ?"

"మీతో యెన్నో విషయాలు చెప్పాలి నేను. నిజంగా సీరియస్‌గా అంటున్నా" నన్నాడతను. "అన్ని– విష

యాలలో మచ్చుకి వక్కటి చెప్పండి, నేను వచ్చేదీ రాందీ చెబుతాను" అంది ఇందిర ధైర్యం తెచ్చుకుని.

క్షణంఆలోచించి అన్నాడతను "పెళ్ళి అనే వ్యవస్థ గురించి మీతో వివరంగా చర్చించాలి." మనస్సులోని భారాన్ని యేదో అదృశ్యహస్తం పూర్తిగా తుడిచివేసింది. ఆ నిమిషంలో ఆమెకి ప్రపంచ మతిసుందరంగా కనిపించింది. తృప్తిగా 'నా కింకేం కావాలి' అనుకుందికూడా. తాను ఇంతకాలం తపస్సుచేసిన మనిషి ఛాయలెక్కడా కనిపించలేదు ఆమె మనస్సులో. ఆ జాగాలో శ్రీనివాసరావే కనబడ్డాడు.

"తప్పకుండా వస్తా" నంది ఇందిర మెల్లిగా. ఎదురు చూడని బస్సు వచ్చింది. "ఇందిరా" అన్నాడతను "వస్తావుకదూ" అన్నట్టు ధ్వనిస్తూ. చిరునవ్వుతో చెయ్యూపింది ఇందిర.

"తమని వదిలిపెట్టివెళ్ళేరోజు దగ్గరకొచ్చిందనేమో తన గదిలో వస్తువులు తన వంక బాధగా, జాలిగా చూశాయి. తాను మాత్రం సినిమాలో నాగేశ్వర్రావులా అపార్థం చేసుకుంది వాటి వ్యథాపూరిత దృక్కుల"ననుకుంది ఇందిర బస్సులో కుదుపులకి క్రిందికి వొరగకుండా కమ్మీని గట్టిగా పట్టుకుంటూ.

★★★